


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 353, పేజీలు - 08
ఆదివారం, జూన్ 14, 2026 వెల: 5 రూ/.






## సీరియస్‌గా లేని బీఆర్ఎస్
# రాజకీయ వ్యూహం
### ఒంటరి పోటీ అంటే ప్రజలు నమ్ముతారా?

హైదరాబాద్ **(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.

**బీజేపీ వైపు వెళ్తున్న బీఆర్ఎస్ ఓటు బ్యాంక్**

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమీ-అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది. ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**బీజేపీతో బంధంపై ప్రచారాలను తిప్పికొట్టలేకపోతున్న బీఆర్ఎస్**

బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ-బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత

2లో..

## సువేందు చక్రబంధం
### - తృణమూల్ ఉక్కిరిబిక్కిరి



కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అదే సమయంలో ఆయన నివాసంపై కోల్‌కతా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కోల్ కత కాళీఘాట్ లోని నివాసంలో

2లో..

## బాసర టు భద్రాచలం
# ఆధ్యాత్మిక కారిడార్!
### - ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం వరాలు!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పూర్తయిన మూడేళ్ల సందర్భంగా పిప్పిరిలో నిర్వహించిన సభలో గూడెంగుట్ట ఆలయ అభివృద్ధి పనుల ప్రస్తావన వచ్చిందన్నారు. ఆ సభ జరిగిన 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, భూమిపూజ నిర్వహించడం ప్రజాప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. దాదాపు రూ. 70 కోట్ల భారీ నిధులతో

2లో..

## డీఎస్సీపై సీబీఐ విచారణ చేయించాల్సిందే
### - స్కామర్ల ఆడియో టేప్ బయటపెట్టిన జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన 16,000 ఉపాధ్యాయ పోస్టుల 'మెగా డీఎస్సీ' నియామక ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

2లో..

## పెట్టుబడులే లక్ష్యంగా సింగపూర్‌కు
# సీఎం చంద్రబాబు



### - సీఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోకు హాజరు
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం
- అమరావతి నిర్మాణంపై సుర్బానా జురాంగ్ సంస్థతో చర్చలు
- 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన దాదాపు ఖరారు అయ్యింది. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడుల సాధన కోసం ఇప్పటికే పలుమార్లు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే.తాజాగా మరోసారి సింగపూర్‌లో పర్యటించనున్నారు. 2026 సీఐఐ పెట్టుబడుల సన్నాహక రోడ్‌షోలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ రెండు రోజులపర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు కానున్నారు.

2లో..



## భారీ వర్షం..
# అప్రమత్తంగా ఉండాలి
### - ఈ 6 జిల్లాలకు రెడ్ అలర్ట్ - సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్ **(ప్రశ్న న్యూస్)** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ పరిధితోపాటు రాష్ట్రంలోని ఆరు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయని దీనిప్రభావంతో మట్నత్తం 7 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో శనివారం వర్షాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వం 'ఫస్ట్ హాఫ్' పూర్తిగా విఫలం

2లో..



## "మోడీ గిఫ్ట్" పేరుతో సూపర్ గిఫ్ట్
### - టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు
### - తన జీతంతోనే బోర్డు పరీక్ష ఫీజులు చెల్లింపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతమైన 12 ఏళ్ల పాలనా స్ఫూర్తిని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్వచ్ఛ పాఠశాల అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలు



2లో..

## కోవర్టుల సంగతి
# తేలుస్తాం
### - అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

2లో..



## హైదరాబాద్‌లో ఏడుగురు
# బంగ్లాదేశీయులు అరెస్ట్
- జీడిమెట్ల ప్రాంతంలోని గాజులరామారంలో అద్దె ఇంటిపై దాడులు
- ఎలాంటి పత్రాలు లేకుండా నివసిస్తున్న బంగ్లాదేశీయులు
- జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలింపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో అక్రమంగా దేశంలోకి చొరబడిన ఏడుగురు బంగ్లాదేశ్ పౌరులను తెలంగాణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులరామారం హెచ్ఏఎల్ ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉన్న వీరు అక్రమంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

2లో..




## పెరుగుతున్న బ్రెయిన్ ఫాగ్
### - అందరినీ వేధిస్తున్న కొత్త సమస్య!

2లో..



## నూతన ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్
### - జూన్ 30న బాధ్యతల స్వీకరణ

2లో..



## సీరియస్‌గా లేని

# బీఆర్ఎస్ రాజకీయ వ్యూహం

ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

### గ్రేటర్ ఎన్నికల్లో తేలిపోతుందా?

త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బి-టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

# సువేందు చక్రబంధం

ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు.రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షినేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# బాసర టు భద్రాచలం ఆధ్యాత్మిక కారిడార్!

గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను ఆయన వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రాష్ట్రములోని ఆధ్యాత్మిక క్షేత్రాల పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 2,216 కోట్లు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. గతంలో మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామన్నారు.

రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు, ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్లను మంజూరు చేసిందన్నారు.బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ. 802 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

ప్రజల నమ్మకాలను, వారి కోరికలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయానికి ప్రాణం ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందులో భాగంగా గూడెంగుట్ట పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ (ఎత్తిపోతల పథకం) పనుల కోసం రూ. 74 కోట్లు కేటాయించి, ఈరోజు భూమిపూజ చేసుకోవడం శుభపరిణామన్నారు.మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఆధ్యాత్మికత మరియు సాగునీటి రంగాల అభివృద్ధికి బహుముఖ వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావును భట్టి విక్రమార్క మనస్ఫూర్తిగా అభినందించారు. కేవలం అధికార హోదాను అనుభవించడం కాకుండా, నిరంతరం ప్రజల కోసం సేవ చేయడమే ప్రజాప్రతినిధి బాధ్యత అని ప్రేమ్‌సాగర్ రావు నిరూపిస్తున్నారన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కూడా ప్రేమ్‌సాగర్ రావు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి పనిచేస్తున్నారని కొనియాడారు. చివరగా, గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసి, రాబోయే రోజుల్లో జరిగే ప్రారంభోత్సవ మహోత్సవంలో కూడా మనమందరం ఇదే ఉత్సాహంతో పాల్గొందామని పిలుపునిచ్చారు.

# డీఎస్సీపై సీబీఐ విచారణ చేయించాల్సిందే

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఇదొక ప్రణాళికాబద్ధమైన 'మెగా స్కామ్' గా సాగిందని ఆయన ఆరోపించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశలను అపహాస్యం చేస్తూ, పారదర్శకతను పూర్తిగా తుడిచిపెట్టేసి, ఈ రిక్రూట్‌మెంట్‌ను ఒక ధనార్జన యంత్రంగా మార్చేశారని జగన్ సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఇంతటి భారీ అక్రమాలకు పాల్పడినందున, దీనిపై స్వతంత్ర సంస్థ అయిన సీబీఐ చేత విచారణ జరిపించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.ఈ కుంభకోణంలో దాగి ఉన్న ప్రధాన అక్రమాలను జగన్ సాక్ష్యాలతో సహా వివరిస్తూ పరీక్షల నిర్వహణలో దశాబ్దాలుగా వస్తున్న భద్రతా ప్రమాణాలను చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టిందని దుయ్యబట్టారు. ప్రశ్నపత్రాల తయారీ , పరీక్షల నిర్వహణ బాధ్యతలను వేర్వేరుగా ఉంచే సంప్రదాయాన్ని బద్దలు కొట్టి, రెంటినీ ఒకే అధికారికి అప్పగించారని విమర్శించారు. అంతేకాకుండా, అత్యంత రహస్యంగా ఉంచాల్సిన ప్రశ్నపత్రాల అప్‌లోడింగ్ విధులను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కట్టబెట్టారని, అందువల్లే ఎస్సీఈఆర్‌టీలో పనిచేసే ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఈ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని ఆరోపించారు. ఆ తర్వాత సదరు అభ్యర్థి డేటాను మెరిట్ లిస్ట్ నుండి తొలగించడం, అతను కోర్టును ఆశ్రయించడం వంటి పరిణామాలు పక్కాగా 'పేపర్ లీక్' జరిగిందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలని జగన్ పేర్కొన్నారు.

"చంద్రబాబు, లోకేష్ ముందే రచించిన ఒక పాలసీ బ్లూప్రింట్ ప్రకారం స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు డీఎస్సీ రాతపరీక్ష నుంచి మినహాయింపు ఇస్తూ జీవోలు తెచ్చి, రిక్రూట్‌మెంట్ ముగిశాక మళ్లీ పాత పాలసీని పునరుద్ధరించారు. అంటే బ్యాక్‌డోర్ ఎంట్రీ ద్వారా తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికే ఈ దొంగచాటు జీవోల నాటకమాడారు" అని వైఎస్ జగన్ ఆరోపించారు. ఫలితాల ప్రకటనలోనూ తీవ్రమైన గోప్యత పాటించారని, కలెక్టరేట్ నోటీస్ బోర్డుల్లో మెరిట్ లిస్టులు పెట్టకుండా కేవలం ఆన్‌లైన్ విధానానికే పరిమితం చేసి అభ్యర్థులను అయోమయంలోకి నెట్టారని జగన్ ఆరోపించారు. సెలక్షన్ రూల్స్ 2025 లోని రూల్ 20 ని పూర్తిగా ఉల్లంఘించారని, 1:1 నిష్పత్తిలో పిలిచి, సర్టిఫికేట్ వెరిఫికేషన్ విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎంతో మంది అభ్యర్థుల పేర్లను ఫైనల్ సెలక్షన్ లిస్ట్ నుండి దారుణంగా తొలగించారని మండిపడ్డారు. అర్హులైన ఎంతో మంది మెరిట్ అభ్యర్థులు, నిజమైన క్రీడాకారులు ఈ మోసపూరిత విధానాల వల్ల రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఉపాధ్యాయ పోస్టుల కోసం సాగిన ఒక ఆడియో/వీడియో బేరసారాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపినప్పటికీ, ప్రభుత్వం కేవలం ఒక టోకెన్ కేసు నమోదు చేసి నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చిందని కనీసం ఎఫ్ఐఆర్‌లో నిందితుడి పేరు కూడా చేర్చకుండా కేవలం అనుమానితుడు అని పేర్కొనడం వెనుక పెద్దల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని జగన్ ట్వీట్ చేశారు. ఈ మెగా స్కామ్ మూలాలు నేరుగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి వద్దే ఉన్నాయని, రాష్ట్ర పరిధిలోని దర్యాప్తు సంస్థలు వీరి కిందే పనిచేస్తాయి కాబట్టి నిష్పక్షపాత విచారణ సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే కేంద్ర సంస్థ అయిన సీబీఐతోనే సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# పెట్టుబడులే లక్ష్యంగా సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

### సింగపూర్‌కు సీఎం చంద్రబాబు పయనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన ఖరారు అయ్యింది. రెండు రోజులపాటు సింగపూర్‌లో సీఎం చంద్రబాబు నాయుడు బృందం పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం చంద్రబాబు నాయుడు సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్ తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అవుతారు.

### సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్‌షోకు హాజరు

రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్ఏ361ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్-అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. ఆ తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు.

తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు.

# "మోడీ గిఫ్ట్" పేరుతో సూపర్ గిఫ్ట్

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పరిశుభ్రంగా ఉండేలా శుభ్రతా చర్యలు చేపట్టారు. ఈ పిలుపులో భాగంగా శనివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేంద్రమంత్రి చేరుకున్నారు. అక్కడ ఆయన స్వయంగా చీపురు పట్టి తరగతి గదులను ఊడ్చారు.

ఆపై వాటర్ పైపు చేతబట్టి బెంచీలు, టేబుళ్ల కింద ఉన్న దుమ్ము, ధూళిని కడిగిపారేశారు. క్లాస్ రూమ్‌లోని మూలమూలకు వెళ్లి మగ్గు, బకెట్ సహాయంతో క్లీన్ చేసి గదులను అద్దంలా మెరిపించారు. మంత్రి స్వయంగా బడిని శుభ్రం చేయడం చూసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశ్చర్యపోయారు. బండి సంజయ్ ఇచ్చిన పిలుపుతో నియోజకవర్గవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు తమ సొంత ఖర్చులతో చీపుర్లు, బకెట్లు కొనుగోలు చేసి ప్రభుత్వ స్కూళ్లను శుభ్రం చేసే మహా యజ్ఞంలో భాగస్వాములయ్యారు. దీనికోసం ముందురోజే నియోజకవర్గంలో టిఫిన్ బైఠక్ నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో రాజకీయాలు చూడకూడదన్నారు.

దేశవ్యాప్తంగా మోదీ 12 ఏళ్ల పాలనపై ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. కానీ కరీంనగర్‌లో వినూత్నంగా మన పిల్లలు చదువుకునే బడులను బాగు చేసుకోవాలని సంకల్పించామన్నారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి టీచర్లు, విద్యార్థులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా సహకరిస్తున్నారన్నారు. కేవలం శుభ్రం చేయడమే కాదు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి ఎల్లుండి నుంచి గ్రామాలు, మండలాల్లో భారీ ర్యాలీలు నిర్వహించబోతున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కోసం మరిన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఈసారి కూడా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా.. టెన్త్ విద్యార్థులందరి విద్యాభారాన్ని తగ్గించేందుకు, తన కేంద్ర మంత్రి వేతనం నుంచి వారి పదో తరగతి బోర్డు పరీక్ష ఫీజులను పూర్తిగా తానే చెల్లిస్తానని బండి సంజయ్ ప్రకటన చేశారు. త్వరలోనే నియోజకవర్గంలోని స్కూళ్ల సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, కేంద్ర నిధుల ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం 'ఫస్ట్ హాఫ్' పూర్తిగా విఫలం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# నూతన ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు.
ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# భారీ వర్షం..అప్రమత్తంగా ఉండాలి

తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని యుద్ధ ప్రాతిపదికన వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### క్యూర్ పరిధిలో హై అలర్ట్‌తో ఉండాలి

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని అధికార యంత్రాంగం హై అలర్ట్ తో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక కార్యదర్శితో సహా సీనియర్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు కురిసిన సందర్భాల్లో నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు సత్వరం తీసుకోవాలని చెప్పారు. వర్షాలపై వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ముందస్తు ప్రణాళికతో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా బృందాలను మోహరించి అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### సమన్వయంతో పని చేయండి

వర్షాలపై వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ముందస్తు ప్రణాళికతో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా బృందాలను మోహరించి అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్, పోలీస్ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని శాఖల మధ్య సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగా విపత్తు నిర్వహణ బృందాలను మోహరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### 6 జిల్లాలకు రెడ్ అలర్ట్

జీహెచ్ఎంసీ పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడే అవకాశం ఉంది. గంటకు 60-90 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. శేరిలింగంపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఈ క్రమంలో ఆరు జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది.'సూర్యాపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ శాఖ సూచించింది.

# కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు.కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో ఏడుగురు బంగ్లాదేశీయులు అరెస్ట్

దీంతో జీడిమెట్ల స్టేషన్ ఎస్‌హెచ్ఓ తన బృందంతో కలిసి అక్కడకు చేరుకుని సోదాలు నిర్వహించడంతో ఏడుగురు విదేశీయులు అక్కడ ఉన్నట్లు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా వారి దగ్గర ఎలాంటి పాస్‌పోర్టులు, వీసాలు ,ఇతర అధికారిక పత్రాలు లేవని వెల్లడయ్యింది.వీరంతా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో బయటపడినట్టు పోలీసులు వివరించారు. అక్రమ చొరబాటుదారులను మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు పోలీసులు తరలించారు. అక్కడ నుంచి బంగ్లాదేశ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. అదుపులోకి తీసుకున్నవారిలో నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్‌వోటీ కూకట్‌పల్లి జోన్ పోలీసులు పాల్గొన్నారు.గతంలోనూ అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకున్న సంఘటనలు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 20 మంది బంగ్లాదేశ్ పౌరులను పట్టుకుని సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ బలగాలకు తెలంగాణ పోలీసులు అప్పగించారు. అంతకు ముందు ఏప్రిల్‌లోనూ అక్రమంగా ప్రవేశించే బంగ్లాదేశీయులకు బర్త్ సర్టిఫికెట్ జారీ కేసులో ఆరుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఢాకా నుంచి అక్రమంగా కోల్‌కతా మీదుగా హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డ బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ హసిబుల్ కేసు విచారణలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇద్దరు బంగ్లాదేశ్ పౌరులు సహా ఏడుగుర్ని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోకి అక్రమంగా వచ్చిన వారిని పోలీసులు గుర్తిస్తున్నారు.

# పెరుగుతున్న బ్రెయిన్ ఫాగ్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఒకప్పుడు పెద్ద వయసు వారిలో కనిపించే మతిమరుపు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు ఇప్పుడు అన్ని వయసుల వారినీ వేధిస్తున్నాయి. చిన్న విషయాలను మర్చిపోవడం, దేనిపైనా దృష్టి పెట్టలేకపోవడం, మానసికంగా అలసిపోయినట్లు అనిపించడం వంటి లక్షణాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. వైద్య పరిభాషలో దీన్ని నిర్దిష్టమైన వ్యాధిగా చెప్పనప్పటికీ, ఈ లక్షణాలన్నింటినీ కలిపి 'బ్రెయిన్ ఫాగ్' అని పిలుస్తున్నారు. ఆధునిక జీవనశైలి ఒత్తిళ్ల కారణంగా ఈ సమస్య ఇప్పుడు యువత, ఉద్యోగులు, విద్యార్థులలో కూడా సర్వసాధారణంగా మారుతోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బ్రెయిన్ ఫాగ్ అనేది రోజువారీ జీవితంలో స్పష్టంగా కనిపిస్తుంది. గదిలోకి ఎందుకు వెళ్లామో ఒక్కసారిగా మర్చిపోవడం, పుస్తకంలోని ఒకే పేరాను పదే పదే చదివినా అర్థం కాకపోవడం, సాధారణ పనుల సమయంలో కూడా దృష్టిని కేంద్రీకరించలేకపోవడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. ఇలాంటి అనుభవాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని, ఇది పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతోందని చాలామంది వాపోతున్నారు.

### ప్రధాన కారణాలు ఇవే..

ఈ పరిస్థితికి దీర్ఘకాలిక ఒత్తిడే ప్రధాన కారణమని ఫరీదాబాద్‌లోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హాస్పిటల్ న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ వినీత్ బంగా వివరించారు. పని ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, చదువుల భారం, డిజిటల్ ప్రపంచం నుంచి నిరంతరం వెల్లువెత్తే సమాచారం మెదడు స్పష్టంగా ఆలోచించే సామర్థ్యాన్ని దెబ్బతీస్తోందని ఆయన తెలిపారు.

దీర్ఘకాలిక ఒత్తిడి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశోధనలు కూడా రుజువు చేస్తున్నాయి.ఒత్తిడితో పాటు, నిద్రలేమి కూడా బ్రెయిన్ ఫాగ్‌కు మరో ముఖ్యమైన కారణం. తగినంత నిద్ర లేనప్పుడు మెదడు విశ్రాంతి తీసుకోలేదు. జ్ఞాపకాలను పదిలపరచుకోవడం, మెదడులోని వ్యర్థాలను శుభ్రపరచడం వంటి కీలక ప్రక్రియలకు ఆటంకం కలుగుతుంది. తక్కువ గంటలు నిద్రపోయి అలవాటు చేసుకున్న వారిలో కూడా క్రమంగా ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లుతాయని డాక్టర్ బంగా హెచ్చరించారు.వీటితో పాటు గంటల తరబడి స్క్రీన్లకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, డీహైడ్రేషన్ వంటివి సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కోవిడ్-19 వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత మిగిలిన దీర్ఘకాలిక ప్రభావాలు, ఆందోళన, డిప్రెషన్, హార్మోన్ల అసమతుల్యత కూడా బ్రెయిన్ ఫాగ్ లక్షణాలకు దారితీస్తాయి. ఇటీవలి కాలంలో ఈ తరహా అభిజ్ఞా సమస్యలు ముఖ్యంగా యువతలో పెరిగినట్లు పలు అధ్యయనాలు, నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'తో పాటు ఇతర ఆరోగ్య ప్రచురణలు కూడా ఈ అంశంపై ప్రత్యేక కథనాలను ప్రచురించాయి.

### నివారణ, పరిష్కార మార్గాలు

ఈ సమస్యను అధిగమించడానికి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రోజూ కనీసం 7-8 గంటల పాటు నిరంతరాయంగా నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా లేదా ధ్యానం వంటివి పాటించడం ముఖ్యం. స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవడం కూడా తప్పనిసరి. ఒకవేళ ఈ లక్షణాలు తీవ్రంగా ఉంటే, వాటిని తేలికగా తీసుకోకుండా వైద్యులను సంప్రదించి ఇతర ఆరోగ్య సమస్యలేవైనా ఉన్నాయేమో నిర్ధారించుకోవడం మంచిది.

# ప్రైవేట్ విద్యాసంస్థలు.. వ్యాపార కేంద్రాలు

- వ్యాపార సంస్థలుగా తయారైన ప్రైవేట్ విద్యా సంస్థలు
- కార్పొరేట్ విద్య అంటూ పెద్ద ఎత్తున ఫీజుల దోపిడీ
- మండల వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజులు
- పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు
- ఫీజుల భారం మోయలేక ఉక్కిరి బిక్కిరవుతున్న తల్లిదండ్రులు
- ఎక్కడా అమలుకు నోచుకోని విద్యా హక్కు చట్టం
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు

**ప్రైవేట్ విద్య వ్యాపారంగా మారింది. పాడుబడిన భవనాలకు రంగుల అద్ది..బొమ్మలు గీసి.. దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అన్నది ఆ దేవుడికే ఎరుక! కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు విద్యపేరిట వ్యాపారం చేస్తున్నాయి. నర్సరీ నుంచి డిగ్రీ వరకు ఫీజుల రూపంలో రూ. లక్షలకు లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం కూడా యాజమాన్యాలే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏ కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లోనూ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉండరు. ఉన్నా.. కొద్ది మంది మాత్రమే! జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో.. ఏటా ఫీజులు పెంచుతూ భారీగా వసూలు చేస్తున్నా.. కనీస చర్యలు తీసుకునే వారు లేరు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరు.**

మేడ్చల్( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ మండలంలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే కార్పొరేట్ స్కూళ్లల్లో ఎల్కేజీ ఫీజు లే సుమారు రూ.30వేల నుంచి రూ. లక్ష మధ్యలో వ సూలు చేస్తున్నారు. ఇంకా కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజు లమోతమోగిస్తున్నాయి. కొన్ని స్కూళ్లల్లోనైతే అప్పుడే అడ్మిషన్లు మొదలు పెట్టేశారు. తమ పిల్లలను నాణ్యమై న చదువులు చదివించాలన్న తల్లిదండ్రుల కోరిక ప్రైవే ట్ విద్యా సంస్థలకు మంచి అవకాశంగా తయారైంది. ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి అక్రమ వసూళ్లకు తెరతీశారు. సాధారణ చదువులతో ఐఐటి ఫౌండేషన్ అంటూ మరికొంత నొక్కుతున్నాయి. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి, వెనక్కి వెళ్ళ లేక చేర్పించే సాహసం చేయలేక తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

### కనీస సౌకర్యాలు కరువు..

తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. చాలా పాఠశాలల్లో రేకుల భవనాలే తరగతి గదులుగా కొనసా గుతున్నాయి. ఎలాంటి వెలుతురు ఉండడం లేదు. పిల్లలకు ఆడుకోవడానికి కూడా గ్రౌండ్ లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడాసౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. అలాగే పాఠశాల యాజమాన్యాలు వారికి అనుకూలమైన వారిని పెట్టుకుని పేరెంట్స్ కమిటీల సమావేశాలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి. గతేడాది కన్నా ఈ వి ద్యా సంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 10 నుంచి 20 శాతం వరకు ఫీజులను పెంచేందుకు రంగం సిద్ధం చేశాయి. దీనికితోడు పుస్తకాలు, నోటు పుస్తకాల రేట్లు 10 శాతం పెరగడం తల్లిదండ్రులకు అదనపు భారంగా మారింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ ని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పించాలనే



ఉద్దేశంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరిగి వస్తున్న స్థితి మండలంలో నెలకొంది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్ల యితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి. లేదంటే అడ్మిషన్లు ఇవ్వబోమంటూ విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

### ఫీజులపై నియంత్రణ ఏది.?

ప్రైవేటు, కార్పొరేట్ ఫీజుల నియంత్రణ కోసం అన్ని రకాల ఉత్తర్వులూ వున్నాయి. కానీ ఆచరణలో అవన్నీ ఉత్తవే. 1994లో వచ్చిన జీవో నెం-1 ప్రైవేటు పాఠశాలలు స్థాపన, నిర్వహణ, అడ్మిషన్లు, ఫీజులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, తనిఖీలు తదితర విధి విధానాలను స్పష్టం చేస్తున్నాయి. వాటిని అమలు చేయలేమని ప్రైవేటు విద్యాసంస్థలు చెప్పేస్తున్నాయి. షూ, టై, బెల్టు అమ్మే వ్యాపార కేంద్రాలుగా పాఠశాలలు మారినా చర్యలు తీసుకోకుండా అధికారులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు, కార్పొరేట్ ఫీజుల నియంత్రణకై అనేక వాదనలు జరుగుతున్నాయి.

### విద్యా హక్కు చట్టం అమలు తుంగలోకి..

విద్యాహక్కు చట్టం సెక్షన్-6 ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్-11 ప్రైవేటు యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజు కంటే ఎక్కువ వసూలుచేయ కూడదు. ప్రభుత్వనిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులోపెట్టాలి. సెక్షన్1, 2ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్ నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీస్ బోర్డ్ పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్-12 ప్రకారం టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20కి మించరాదు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమా న్యం 25 శాతం సీట్లను ఎస్సి, ఎస్టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్ బుక్స్, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, ఇతర స్టేషనరీని అమ్మరాదు. ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా సూచించరాదు. విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్లైన్లో ఉంచాలి. ఆట స్థలం తప్పనిసరిగా ఉండాలి. పురపాలక పరిధిలో పాఠశాలల్లో 1000చదరపు మీటర్ల ఆటస్థలం, గ్రామీణ ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. పాఠశాల యాజమాన్యం అభం శుభం తెలియని చిన్నారుల చేతికి స్కూల్ ఫీజుల రసీదులు ఇస్తున్నది. మీ అమ్మ నాన్న ఇంకా ఫీజు చెల్లించలేదంటూ వారిని కించ పరుస్తున్నారు. ఫీజు స్లిప్పులను చిన్నారుల చేతికిస్తే జరిమానా ఉంటుంది. అనుమతులు లేకుండా స్కూళ్లను ప్రారంభించ కూడదు. ప్రభుత్వ అనుమతి తోనే



ప్రారంభించాలి. ఆరు నెలల్లోపు అనుమతులు పొందాలి. భవనానికి ప్రహరీ ఉండి, గాలి వెలుతురు బాగా వచ్చేలా ఉండాలి. చిన్నారులు నిద్రపోవడానికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండాలి. మరుగుదొడ్లు, స్నానాల గదిలో టవలు, సబ్బులు ఉంచి, పరిశుభ్రత చర్యలు పాటించాలి. ప్లే స్కూల్కు తప్పనిసరిగా ప్లే స్కూల్ అని బోర్డు పెట్టాలి. ప్రవేశాలు పూర్తయిన తర్వాత



తల్లిదండ్రుల కమిటీని నెలలోపు నియమించాలి. ఈ కమిటీని ప్రతి సంవత్సరం మారుస్తుండాలి. ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి ఆన్ని అవసరాలను నమోదు చేయాలి. పిల్లలకు జంక్ఫుడ్ ను అనుమతించకూడదు. పోషకాలతో కూడిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలి. ఇటువంటి నిబంధనలు చాలా స్కూళ్లు పాటించకుండా నడుపుతున్నాయి. ప్రతి జిల్లాకు జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో కమిటీని ఏర్పాటు చేసి, ఫీజులను నియంత్రించే ఆలోచన చేయాలి. అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేటు పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పాఠశాలల గుర్తింపును రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

### ఎక్కడ ఫీజుల నియంత్రణ చట్టం.?

ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్స్లో ఫీజుల మోత మోగుతోంది. ఇది ప్రతియేటా విద్యార్థుల తల్లిదండ్రులకు భారమవుతోంది. ప్రయివేట్, కార్పొరేట్,ఇంటర్నేషనల్ పేరుతో నడిపిస్తున్న స్కూల్స్ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇటు విద్యాశాఖాధికారులుగానీ, అటు ప్రభుత్వం గానీ ఆ స్కూల్స్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ నిబంధనలు ఈ స్కూల్స్ క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం దారుణం. ఫీజులను కట్టడి చేస్తామంటూ సంవత్సరాల నుంచి చెబుతున్న మాటలను ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. మరో వైపు స్కూల్స్ వివిధ ప్రాంతాలలో బ్రాంచిల పేరుతో విద్యా వ్యాపారం సాగిస్తున్నారు. ఆఖరికి పుస్తకాలు, బూట్లు, టై, బెల్ట్ వరకు ఇష్టం వచ్చినట్లు రేటు పెట్టి అమ్ముతున్నారు. నిజానికి ప్రభుత్వ సూచనల మేరకు స్కూల్ పరిధిలో ఇవి అమ్మరాదు అని నిబంధన ఉన్న పట్టించుకోకుండా వీటిని అమ్ముతున్నారు. పూర్తిస్థాయి లో భవనాలు ఉండవు, క్రీడా స్థలాలు ఉండవు, ఇరుకైన తరగతి గదులు, మౌలిక సదుపాయాలు ఉండవు. ఫైర్ సేఫ్టీ ఉండవు అయినప్పటికీ ఈ స్కూలుకు రెన్యువల్కు దరఖాస్తు పెట్టుకుంటే విద్యాశాఖ అధికారులు అనుమతులిచ్చేస్తున్నారు. వాస్తవానికి ఏ విద్యా సంస్థనైనా ట్రస్ట్ పేరిట నడపాలి. దానికి ఒక గవర్నమెంట్ బాడీ ఏర్పాటు చేయాలి.అయితే కార్పొరేట్ పాఠశాలలో నామ మాత్రంగా గవర్నమెంట్ బాడీ చూపిస్తున్నా, అధికారం మొత్తం యాజమాన్యం చేతుల్లో పెట్టుకుంటుంది. కొన్ని స్కూల్స్ ఒకేసారి మొత్తం ఫీజు కట్టాలని నిబంధనలను అమలు చేస్తున్నాయి. లేదంటే అడ్మిషన్లు ఇవ్వడం లేదు. అందుకే వెంటనే అన్ని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ ఉండేటట్టు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లితండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్కను వేధిస్తున్నాడని
# బావను చంపిన బావమరిది

**హైదరాబాద్** అక్కను తరచూ వేధిస్తున్నాడని బావను బావమరిది హతమార్చాడు. గోల్కొండలోని పతేదర్వాజా ప్రాంతానికి చెందిన రుక్సానా అనే మహిళను పాతబస్తీకి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ చాంది మసూద్ పెళ్లి చేసుకున్నాడు. అయితే రుక్సానా భర్త తరచూ తనతో గొడవ పడుతున్నాడని పుట్టింటికి వచ్చింది. పుట్టింటికి వెళ్లి మరోసారి రుక్సానాతో గొడవ పడుతుండగా, తన అక్కను తరచూ వేధిస్తున్నాడని బావపై బావమరిది సోయల్ తిరగబడ్డాడు. అదే కోపంలో తన స్నేహితులు జాబేర్, అప్పుతో కలిసి చాంది మసూద్ను కత్తులతో విచక్షణారహితంగా హతమార్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మరో ఇద్దరు బలి

**సికింద్రాబాద్** హైదరాబాద్ పాతబస్తీలో విషాదం మరవకముందే.. అల్వాల్ పరిధిలో రోడ్డుపై తెగిపడిన కరెంట్ తీగలు తగిలి కరెంట్ షాక్తో తండ్రి కూతురు మృతి చెందారు. శనివారం తెల్లవారుజామున రోడ్డుపై తెగిపడిన చెట్టు కొమ్మలు తొలగిస్తూ కరెంట్ షాక్తో తండ్రి కూతుళు సందీప్, రితిక మృతి చెందారు. వర్షాకాలం రాకముందు విద్యుత్ అధికారులు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికుల ఆగ్రహం.

## కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టినా నిరాశే మిగిలింది
## ఏడు రోజులైనా లభించని చిన్నారి ఆచూకీ

**కాకినాడ** ఏడు రోజుల క్రితం అదృశ్యం అయిన చిన్నారి జ్ఞానేశ్వరి(2) ఆచూకీలో కీలకం అవుతందని అనుకున్న శునకం నిరాశపరిచింది. చిన్నారితో పాటు అదృశ్యమై, తిరిగి ఇంటికి చేరి, అడవుల దిశగా వెళ్లడంతో.. చిన్నారి జాడ కనిపెట్టడంలో హెల్ప్ అవుతుందనుకున్నారు. దాంతో ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ పెట్టి గాలించగా.. సమీప తోటలు, ప్రధాన రహదారిలో చక్కర్లు కొట్టి.. తిరిగి ఇంటికి చేరుకుంది.తుని మండలం దొండవాక పంచాయతీ సీహెచ్ అగ్రహారం సమీపంలో యాభై ఎకరాల పామాయిల్ తోట కాపలాదారుడిగా పనిచేస్తూ, అదే తోటలో గణేష్, భవాని దంపతులు వుంటున్నారు. గత శనివారం పెంపుడు కుక్కతో కలిసి ఇంటి నుండి వీరి రెండేళ్ల కూతురు జ్ఞానేశ్వరి(జాను) అడవి వైపు వెళ్ళిపోయింది. అటవీ ప్రాంతంలో వందల మంది పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నా లాభం లేకపోవడంతో కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి గాలింపు చర్యలు చేపట్టరు.
కానీ జీపీఎస్ ట్రాకర్ అమర్చిన తర్వాత కుక్క పరిసర ప్రాంతాల్లోనే తిరిగి మళ్లీ ఇంటికి రావడంతో ప్రయత్నం విఫలమయింది. కుక్క ప్రవర్తన వింతగా ఉందని, దాన్ని నమ్ముకుంటే చిన్నారి ఆచూకీ లభించడం కష్టమని స్థానికులు భావిస్తున్నారు.

## సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

సెప్టెంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.22న ఆర్జిత సేవా టికెట్ల విడుదలకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదలఅంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.శ్రీవాణి దర్శన కోటా విడుదలశ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా?వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్లైన్లో విడుదల చేయనుంది.తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల?తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్లైన్లో విడుదల చేస్తారు

## ఇంటి దొంగలను వెతికేపనిలో
# కాంగ్రెస్ హైకమాండ్

**హైదరాబాద్** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఎన్నికల అంశంలో పార్టీ హైకమాండ్ ఇంటి దొంగలను వెతికే పనిలో పడింది. ఏకంగా రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్కే వెన్నుపోటుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మీనాక్షి నటరాజన్కు రాజ్యసభ ఎంపీ చేజారేలా చేసిన, తెలంగాణ కాంగ్రెస్ లీడర్లపై అధిష్టానం ఆరా తీసింది. తెరవెనుక ఆపరేషన్ నడిపిన తెలంగాణ కాంగ్రెస్ నేత ఎవరని అరా తీస్తోంది. కీలక నేత పక్కా ప్లాన్ ప్రకారమే ఆపరేషన్ నడిపించినట్లు పార్టీ పెద్దలు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. నిన్న ఏఐసీసీ అత్యవసర సమావేశం హాట్ హాట్ గా సాగింది.

## సూళ్లూరుపేటలో తప్పిన పెను ప్రమాదం

**సూళ్లూరుపేట** సూళ్లూరుపేట పెను ప్రమాదం తప్పింది. శ్రీ సిటీకి చెందిన ఎస్వీఎల్టీ బస్సు అగ్నికి అహుతి అయింది. ల నుండి కార్మికులను శ్రీ సిటీలో దించి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది. సూళ్లూరుపేట జాతీయ రహదారిపై జీరో పాయింట్ వద్ద ప్రమాదం జరిగింది. కార్మికులు క్షేమంగా బయటపడ్డారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు.

## ఓటరు జాబితాలో బీజేపీ నాయకురాలు
## స్మృతి ఇరానీ పేరు మాయం

**అమేథీ** బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు ఓటరు జాబితానుంచి మాయమయింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అమేఠీ నుండి 2019లో ఎంపీగా ఎన్నికై, మేదాన్ మావయ్ గ్రామంలో స్మృతి ఇరానీ సొంత ఇల్లు నిర్మించుకుని, అదే పంచాయతీలో ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ అక్కడి నుండే పోటీ చేసినా, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జాబితా నుండి స్మృతి ఇరానీ పేరు మాయమయింది. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు అమేఠీ జిల్లా మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు.

## ప్రియుడితో కలిసి
# భర్తను హత్య చేసిన భార్య
### - కాకినాడ రూరల్ సర్పవరంలో ఘటన

**కాకినాడ** భర్తను భార్య తన ప్రియుడితో కలిసి హతమార్చిన ఘటన సర్పవరం లో చోటు చేసుకుంది. మార్చి 13న దుర్గాప్రసాద్ మృతి చెందాడు. భర్త గుండెపోటుతో చనిపోయినట్లు భార్య రమాదేవి నమ్మించింది. రమాదేవికి ఇన్స్టాగ్రామ్ లో బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన గోపిసాయి పరిచయమయ్యాడు.

తరువాత అది అక్రమ సంబంధానికి దారి తీసింది. తమ అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భార్య జ్యూస్ లో నిద్ర మాత్రలు కలిపి భర్తకు ఇచ్చింది. దుర్గా ప్రసాద్ స్పృహ తప్పి పడిపోయిన అనంతరం దిండుతో ఊపిరి ఆడకుండా చేసి భార్య, ప్రియుడు చంపివేసారు. 20 రోజుల కిందట మృతుడు కుమార్తెకు నిద్ర మాత్రల కొనుగోలు బిల్లులు, ప్రిస్క్రిప్షన్ ప్రియుడు పంపాడు. అనుమానంతో కుటుంబ సభ్యులకు మృతుడు కూతురు చూపించింది. విషయం పోలీసులకు చేరింది. కాల్ డేటా రికార్డులు, వాట్సాప్ చాటింగ్ ఫోరెన్సిక్ పరీక్షలు, మరిన్ని సాక్ష్యాలు సేకరించిన పోలీసులు రమాదేవి, గోపి సాయి నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## ఉపాధి హామీ కూలిలను
# పరామర్శించిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్** హుస్నాబాద్ నుండి కరీంనగర్కు వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల పురోగతి, పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితుల గురించి కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసారు. గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. కూలీల సంక్షేమానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తున్నానని అన్నారు.

## తిరుపతి నగరంలో భారీగా కుళ్లిన మాంసం స్వాధీనం



**తిరుపతి** పెద్దపీర్ల చావడిలో వందల కిలోల కుళ్లిన మాంసం పట్టుబడిన ఘటన నగర ప్రజలను కలవరపెడుతోంది. తిరుపతి కి లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. కాసులకి కక్కృతి పడిన కొంత మంది కుళ్లిన మాంసం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతారు. ఈ కుళ్లిన మాంసాన్ని హోటల్స్ కి అమ్ముతూ అవి తిన్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు తరుచూ ఇలాంటి తనికీలు చేస్తూ, కఠిన నిబంధనలు అమలు చేస్తే కొంతైనా ప్రయోజనం ఉంటుంది.

# డ్రైవర్ దారుణ హత్య..
### - అటవీ ప్రాంతం లో మృతదేహం లభ్యం.క

డప నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన అక్కుపల్లి వంశీ (25) హత్యకు గురైన ఘటన కలకలం రేపింది.ఈ నెల 10న యజమాని చింతా రామసుబ్బారెడ్డితో బయటకు వెళ్లిన వంశీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు రెండు రోజుల తర్వాత ఒంటిమిట్ట మండలం సాలాబాద్ సమీప అటవీ ప్రాంతంలో వంశీ మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో ఇది హత్యగా ప్రాథమికంగా నిర్ధారించారు.... ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# వేములవాడ మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- పాఠశాల / కళాశాల ప్రిన్సిపాల్ : లక్ష్మీనారాయణ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాయ్స్ పాఠశాల,కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ముస్లిం మైనారిటీ విద్యార్థులకు మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. 25 శాతం సీట్లు ఎస్సీ,ఎస్టీ, బీసీ,ఓసీ విద్యార్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు.విద్యార్థులకు ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్య,వసతి, భోజనం,పుస్తకాలు, యూనిఫాం,డిజిటల్ తరగతుల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.5వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ, 01-09-2026 నాటికి 9 నుంచి 11 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూన్ 15. ఇంటర్ అడ్మిషన్ల కోసం తాహినియత్ సుల్తానా (7097213355), 5వ తరగతి అడ్మిషన్ల కోసం ఎం. శారద (8008973439)ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- రాష్ట్ర సహకార యూనియన్ . చైర్మన్ : మానాల మోహన్ రెడ్డి**

**- మృతుల కుటుంబాలకు పరామర్శ..**

**రూ.15 వేల ఆర్థిక సాయం - ప్రగాఢ సంతాపం**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణంలోని లింబాద్రిగుట్ట సమీప వడ్డెర కాలనీలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా టీజీఎండీసీ చైర్మన్ ఈరవాత్రి అనిల్‌తో కలిసి బాధిత కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొదిరె నాగమణి-స్వామి, వైస్ చైర్‌పర్సన్ జెజె లత-నర్సయ్య, కౌన్సిలర్లు సంగ్యా నాయక్, అంజుమ్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగేంద్ర బాబు, మెండోరా ఉపసర్పంచ్ కుంట రమేశ్, పిప్రి ఉపసర్పంచ్ జేమ్స్, రావుట్ల నవీన్, బాలగంగాధర్, రవి నాయక్, మేకల శ్రీనివాస్, కూనే ప్రసాద్, శ్యామ్‌రాజ్, నిచ్చెం మహేష్, మనోజ్, మీసాల నవీన్, నితీష్ రెడ్డి, చిన్న రెడ్డి, గంగారపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌళిక వసతుల లక్ష్యం దిశగా కృషి

**- భీంగల్ పట్టణాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- భీంగల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ : జేజే లత -- నర్సయ్య**

**- 10 వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణంలోని 10వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి -- స్వామి, వైస్ చైర్‌పర్సన్ జేజే లత -- నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ జేజే లత -- నర్సయ్య మాట్లాడుతూ, భీంగల్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తెడ్డు అశోక్, నాగేంద్రబాబు, మల్లెల లక్ష్మణ్, చెప్పల గణేష్, తోట సతీష్, వాకా మహేష్, పత్రి రాజేందర్, పఠాని కృష్ణ నవీన్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి పై స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్

**- తిప్పాపురంలో బోరుబావి పూజా కార్యక్రమం**

**- ఎంపీ నిధులతో నీటి సమస్యలకు పరిష్కారం**

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ - తిప్పాపురంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధుల నుంచి మంజూరైన బోరుబావికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్ కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేములవాడలో నెలకొన్న నీటి ఎద్దడిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే పట్టణంలో 8 బోర్లు వేయించాలని ఆదేశాలు జారీ చేసి బోరు బండిని పంపించారని తెలిపారు. మరో వారం రోజుల్లో ఈ 8 బోర్లకు మోటార్లు బిగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వివేక్ రెడ్డి, నేరెళ్ల సాయి, జగన్నాథం, శ్రీనివాస్, కిరణ్, మోక్షిత్, శివ సాయి, మల్లేశంతో పాటు 7వ, 8వ వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగుల పిల్లలకు స్కూల్ బస్సు సౌకర్యం కొనసాగించాలి

**- ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివ రావు**

**- కాంట్రాక్టును నిలిపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటన**

**- బస్ సర్వీస్ కొనసాగించకుంటే సింగరేణిని దిగ్బంధిస్తాం**

**- సింగరేణికి కార్మికులు , పిల్లలు భారం అయ్యారా అని నిలదీత**




గోదావరిఖని (ప్రశ్న న్యూస్) రామగుండం 1, రామగుండం 2, రామగుండం 3 ఏరియాలకు చెందిన సింగరేణి ఉద్యోగుల పిల్లలను గోదావరిఖని, ఎన్టీపీసీ ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు తరలిస్తున్న స్కూల్ బస్సు సౌకర్యాన్ని నిలిపివేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందని బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు తెలిపారు.
దశాబ్దాలుగా సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ రవాణా సౌకర్యాన్ని వినియోగించుకుంటూ విద్యను అభ్యసిస్తున్నారు. సెక్రెట్ హార్ట్ స్కూల్ 50 సంవత్సరాల నుండి, సేంట్ క్లేర్ స్కూల్ 40 సంవత్సరాలనుండి, సచ్ దేవ్ స్కూల్ 30 సంవత్సరాల నుండి బస్సులు నడుస్తున్నవి. ప్రస్తుత బస్సుల కాంట్రాక్టు గడువు ముగియనుండటంతో వాటి కొనసాగింపుకు రామగుండం 1 ఏరియా నుండి పంపిన ప్రతిపాదనలను యాజమాన్యం తిరస్కరించడం కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకమైన చర్య అని అన్నారు. అలాగే మన 8వ కాలనీ లోని సింగరేణి స్కూల్ లో గత సంవత్సరం సీబీఎస్సీ సెలబస్ ఏర్పాటు చేసిన యాజమాన్యం స్కూల్ బస్ లు ఏర్పాటు చేయలేక పోవడం విచారకరం. ఒకవైపు సింగరేణి యాజమాన్యం సీఎస్.ఆర్ నిధులు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్.టి) నిధుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధుల సిఫారసులతో కోట్లాది రూపాయలను వివిధ పనులకు కేటాయిస్తుండగా, మరోవైపు సంస్థ అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేస్తున్న కార్మికుల పిల్లల విద్యకు సంబంధించిన అత్యంత ప్రాథమిక సంక్షేమ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు వెనుకడుగు వేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. కార్మికుల చెమటతో సంపద సృష్టిస్తున్న సింగరేణి సంస్థ, వారి పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన ఈ చిన్న సంక్షేమ కార్యక్రమాన్ని కూడా కొనసాగించలేమని చెప్పడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్కూల్ బస్సు సౌకర్యం నిలిపివేస్తే వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, విద్యాభ్యాసంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి చైర్మన్ ఑ మేనేజింగ్ డైరెక్టర్ మరియు డైరెక్టర్ పా గారు వెంటనే జోక్యం చేసుకుని స్కూల్ బస్సుల కాంట్రాక్టులను పొడిగించి, ఉద్యోగుల పిల్లలకు ప్రస్తుతం ఉన్న రవాణా సౌకర్యాన్ని యథావిధిగా కొనసాగించాలని ఏఐటియుసిగా డిమాండ్ చేస్తున్నామని, లేకపోతే కార్మికులు, విద్యార్థులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి ఖ. రాజ రత్నం, బ్రాంచ్ ఉపాధ్యక్షులు అన్నారావు, సహాయ కార్యదర్శులు శాంసన్, రవి కుమార్, కాంట్రాక్టు కార్మిక సంగమ్ అధ్యక్షులు బుర్ర తిరుపతి,ఆర్గనైసింగ్ సెక్రటరీ లు మహేందర్, సంపత్ నాయకులు కుమారస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత భారత నిర్మాణంలో విద్యాలయాల పాత్ర కీలకం

**- బీజేపీ నాయకులు**

**- బోయినిపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో "మన బడి -- మన బాధ్యత" కార్యక్రమం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల సేవా సుపరిపాలనకు గుర్తుగా భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ పిలుపుమేరకు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బోయినిపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో "మన బడి -- మన బాధ్యత" కార్యక్రమం నిర్వహించారు.మండల అధ్యక్షుడు ఎడపల్లి పరుశురామ్ నేతృత్వంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు కలిసి పాఠశాల ఆవరణల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు స్వచ్ఛమైన విద్యా వాతావరణం కల్పించేందుకు శ్రమించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఆలయాలని పేర్కొన్నారు. వాటిని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, పరిశుభ్రమైన పాఠశాలల నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల,జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు,బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సేవ, సుపరిపాలన, సంకల్పంతో వికసిత భారత నిర్మాణమే లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులకు పోలీసు నోటీసులు

**సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కేటీఆర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేసి సీఎంకి తగిన గౌరవం ఇవ్వాలని కోరుతూ సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన కార్యక్రమంలో, పోలీస్ లు లాటి చార్జీ చేసి, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల పై కేసులు అయ్యాయి. సుమారు 24 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సిరిసిల్ల పట్టణ పోలీసులు కేసు వివరాలతో నోటీసులు అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ, బైరినేని రాము, శ్రీకాంత్ గౌడ్, మునిగలా రాజు, మిరల శ్రీనివాస్, ఎడ్ల తిరుపతి, బండి పరుశురాం, కొంపెల్లి శ్యామ్, తదితరులు నోటీసులు అందుకున్నారు.

## స్వచ్ఛ పాఠశాలగా కుసుమ రామయ్య జడ్పీహెచ్ఎస్

**స్వయంగా క్లాస్‌రూంలను శుభ్రం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**బండి సంజయ్ ఎస్పీపై సీరియస్**

**ఎట్లా పడ్డది బల్ల.. కేంద్ర మంత్రి అనుకుందా కార్యకర్త అనుకుందా**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా శనివారం ఉదయం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కేంద్రమంత్రి బండి సంజయ్ స్వయంగా సందర్శించారు. పాఠశాలలో పనిచేసే మనిషిలా మారి, చేత చీపురు పట్టి, పైపుతో నీళ్లు చల్లుతూ తరగతి గదులను అద్దంలా శుభ్రం చేశారు. బెంచీల కింద దుమ్ము, ధూళి లేకుండా ప్రతి మూలనూ శుభ్రపరిచి ఆదర్శంగా నిలిచారు. బండి సంజయ్ పిలుపుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సొంతంగా బకెట్లు, చీపుర్లు, మగ్గులు తెచ్చుకుని పాఠశాల ఆవరణలను పరిశుభ్రం చేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మన పాఠశాలలను మనం కాపాడుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసిన ఆయన, ఈ ఏడాది కూడా ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి చదివే విద్యార్థులందరికీ తన సొంత వేతనం నుండి పరీక్ష ఫీజులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అలాగే టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తామని కీలక ప్రకటన చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఎల్లుండి (సోమవారం) గ్రామాలు, మండలాల వారీగా భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలపై సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి బండి సంజయ్ తెలియజేశారు.

**సిరిసిల్ల పట్టణంలో బండి సంజయ్ ఎస్పీపై సీరియస్**

ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమం పాల్గొనేందుకు సిరిసిల్లకు వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి స్వాగతం పలికిన సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్ర చారితో జిల్లా ఎస్పీ కి బీఆర్ఎస్ పై అంత ప్రేమ ఎందుకని వ్యాఖ్యలు చేశారు. ప్రోటోకాల్ లో పాల్గొనని కలెక్టర్, ఎస్పీ.

**ఎట్లా పడ్డది బల్ల.. కేంద్ర మంత్రి అనుకుందా కార్యకర్త అనుకుందా..!**

ఎస్పి మహేష్ బి. గితే పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కార్యకర్తను అనుకున్నాడా అంటూ సీరియస్ అవ్వడంతో ప్రతిపక్షాలు ఎట్లా పడ్డది బల్ల.. కేంద్ర మంత్రి అనుకుందా కార్యకర్త అనుకుందా..! అంటూ విమర్శలు చేశారు.

## జిమ్‌లో మహిళా పైలట్‌కు వేధింపులు

**- కేసు నమోదు**

**హైదరాబాద్** సనత్ నగర్ లో వున్న కల్ట్ జిమ్ ఫిట్నెస్ మేనేజర్ సంతోష్ గౌడ్ పై మహిళా పైలెట్ ఫిర్యాదు చేసింది. జిమ్ ట్రైనింగ్ పేరుతో పైలెట్ ను లోనేర్చుకునే ప్రయత్నం ట్రైనర్ సంతోష్ గౌడ్ చేసాడు. ఒక రాత్రి తనతో గడపాలని పైలెట్ పై ఒత్తిడి చేసాడు. ఈ విషయంలో సంతోష్ గర్ల్ ఫ్రెండ్ రజినీ కుడా అతడికి సహకరించింది. ఇద్దరితో ఒకేసారి ప్రైవేటు గా కలిసి ఉండటం సంతోష్ ఫాంటసీ అని పైలెట్ కు వేధింపులకు గురి చేసారు. పైలెట్ ఒప్పుకోకకపోవడం తో ఇన్స్టాగ్రామ్ లో లో అసభ్యకర మెసేజ్ లు జిమ్ ఫిట్నెస్ మేనేజర్ సంతోష్ పెట్టాడు. దాంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ‘దృఢమ్’ మూవీ రివ్యూ!

మలయాళంలో ‘షేన్ నిగమ్’ కి మంచి క్రేజ్ ఉంది. ఆయన పోలీస్ ఆఫీసర్ గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ ‘దృఢమ్’. జీతూ జోసెఫ్ శిష్యుడు ‘మార్టిన్ జోసెఫ్’ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. జీతూ జోసెఫ్ సమర్పకుడిగా వ్యవహరించాడు. అందువలన ఈ సినిమాపై ఆయన మార్క్ కనిపిస్తుంది. మే 8వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 12వ తేదీ నుంచి ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో కలుపుకుని ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. విజయ్ (షేన్ నిగమ్) ‘పాలక్కడ్’ కి చెందిన యువకుడు. తల్లిదండ్రుల కోరిక మేరకు అతను పోలీస్ ఆఫీసర్ అవుతాడు. ఫస్టు పోస్టింగ్ పై, అడవిని అనుకుని ఉన్న ఓ విలేజ్ కి వెళతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ స్టాఫ్ గా, కృష్ణన్ ..బాలన్ .. సత్యన్ .. ఆనంద్ .. విద్య .. రమ్య ఉంటారు. కృష్ణన్ మాత్రం పదవీ విరమణకు దగ్గరలో ఉంటాడు. అందరూ కూడా విజయ్ ను ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటారు. క్వార్టర్స్ లో సరదాగా గడుపుతూ ఉంటారు.

అలాంటి సమయంలోనే ఆ విలేజ్ కి సంబంధించిన ఆయా ప్రదేశాలలో ఒక్కొక్కటిగా శవాలు బయటపడుతూ ఉంటాయి. గుర్తుపట్టలేనంత దారుణమైన స్థితిలో ఆ శవాలు ఉంటాయి. అందరూ కూడా తల వెనుక భాగంలో బలమైన గాయం ఏర్పడిన కారణంగా చనిపోయారనే విషయం పోస్టు మార్టం నివేదికలో వెల్లడవుతుంది. అదే సమయంలో ఒక ఫైనాన్స్ కంపెనీ నుంచి 120 సవర్ల బంగారం .. 50 లక్షల నగదు మాయమవుతుంది. ఆ ఫైనాన్స్ కంపెనీని ‘షాజీ’ నిర్వహిస్తుంటాడు. ఒక వైపున దొంగలను .. మరో వైపున హంతకులను పట్టుకోవడానికి విజయ్ టీమ్ రంగంలోకి దిగుతుంది. హంతకుడు ఒకరేనా? ఫైనాన్స్ కంపెనీలో జరిగిన దొంగతనానికీ .. ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో విజయ్ దర్యాప్తు కొనసాగుతూ ఉంటుంది. ఈ ఇన్వెస్టిగేషన్ లో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా ఎదుర్కొంటాడు? అనేది మిగతా కథ. క్రైమ్ థ్రిల్లర్ .. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలను ఇంట్రెస్టింగ్ గా నడిపించడంలో మలయాళ దర్శకులకు మంచి నైపుణ్యం ఉంది. అందువలన ఈ జోనర్ కి సంబంధించిన సినిమాల పట్ల ఓటీటీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిని కనబరుస్తుంటారు. అదే జోనర్ లో రూపొందిన ‘దృఢమ్’ సినిమా కోసం కూడా అలాగే ఎదురుచూశారు. ఇది జీతూ జోసెఫ్ సమర్పించిన సినిమా కావడం, అంచనాలు పెరగడానికి మరో కారణమైంది. ఈ కథ ఫారెస్టును అనుకుని ఉన్న ఒక విలేజ్ చుట్టూ .. ఆ విలేజ్ లోని పోలీస్ స్టేషన్ చుట్టూ .. అక్కడ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్న పోలీసుల చుట్టూ తిరుగుతుంది. ఒక వైపున హత్యలు .. మరో వైపున ఫైనాన్స్ కంపెనీలో జరిగిన చోరీ .. ఈ రెండు సంఘటనల మధ్యలో సాగే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథగా మనం ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు. మార్టిన్ చాలా వివరంగా ఈ కథను రాసుకున్నాడు. తన గురువైన జీతూ జోసెఫ్ మార్క్ కి దగ్గరగా ఈ కథను తీసుకుని వెళ్లడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. పోలీసులు .. నేరస్థులు .. ఇంటరాగేషన్ .. ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలను సహజత్వానికి దగ్గరగా తీసుకుని వెళ్లడానికి గట్టిగానే ట్రై చేశాడు. అయితే ఆ ప్రయత్నంలో ఆయన కొంతవరకు మాత్రమే సక్సెస్ అయ్యాడని చెప్పుకోవలసి ఉంటుంది.



సాధారణంగా చాలా కథలు ఇంటర్వెల్ బ్యాంగ్ నుంచి కొత్త మలుపు తీసుకుంటూ ఉంటాయి. అక్కడి నుంచి కథ నెక్స్ట్ లెవెల్ కి వెళుతూ ఉంటుంది. కానీ ఈ సినిమాలో అలాంటి ఒక మలుపు ప్రీ క్లైమాక్స్ లో వస్తుంది. అప్పటి వరకూ ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు .. అనుమానిత పాత్రలు తెరపైకి వచ్చి వెళుతూ ఉంటాయి. అయితే ఈ తతంగం మొత్తం నడిచిన తీరు చాలా నిదానంగా అనిపిస్తుంది. సినిమా మొత్తం కూడా చివరి 30 నిమిషాలపై ఆధారపడి నడుస్తుంది. ఈ అరగంట నిడివిలో నడిచే ఎపిసోడ్ కోసమే మిగతా గంటన్నర కథను సాగదీశారని చెప్పొచ్చు. అయితే పోలీసు పాత్రలను పోషించిన ప్రతి ఆర్టిస్ట్ ప్రదర్శించిన నటన రియలిస్టిక్ గా అనిపిస్తూ, మనలను కథ వెంట కదిలేలా చేస్తుంది. మిగతా గంటన్నర కథపై కూడా మరింత కసరత్తు చేసుంటే, ఇది జీతూ జోసెఫ్ సినిమా అంటే నమ్మేసేలా ఉండేది. హత్యలు .. దొంగతనాలు .. అనుమానితులు .. ఇన్వెస్టిగేషన్లు అంటూ గతంలో చాలా సినిమాలు వచ్చి ఉంటాయి. అయితే ఆ సినిమాలలో ఎవరూ చూడని ఒక క్లైమాక్స్ ను .. ఎంతమాత్రం ఊహించని క్లైమాక్స్ ను ఈ సినిమాలో చూడొచ్చు. అరగంటసేపు మనలను కదలనీయకుండా చూసే ఈ క్లైమాక్స్ కోసమే ఈ సినిమాను చూడొచ్చునేమో అనిపించేలా ఉంటుంది. కథాకథనాలు కాస్త నిదానంగానే నడుస్తాయి. అయినా ఆడియన్స్ కి బోర్ కొట్టకుండా చేసినవి ఏమైనా ఉన్నాయంటే అవి లొకేషన్స్ అనే చెప్పాలి. అద్భుతమైన లొకేషన్స్ ఆడియన్స్ ఆకలి తీరుస్తాయి. ఇక నేపథ్య సంగీతం కూడా సందర్భానికి తగినట్టుగా వెళు తుంది. ఎడిటింగ్ వర్క్ కూడా చాలా నీట్ గా అనిపిస్తుంది. ఇంతవరకూ వచ్చిన పోలీస్ కథలకు ఈ కథ చాలా భిన్నంగా అనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కాకపోతే చివరి అరగంట కోసం, దానికి ముందున్న కథను సాగదీయడమే కాస్త ఇబ్బందిని కలిగిస్తుంది. ‘పరిస్థితులే కొంతమందిని హీరోలను చేస్తాయి .. మరికొంతమందిని విలన్స్ గా మారుస్తాయి’ అనే ఒక డైలాగ్ ఈ సినిమాలో ఉంది. ఆ పరిస్థితులు ఏమిటనేది తెలుసుకోవడానికి ఒక గంటన్నరసేపు ఓపిక పడితే, మిగతా అరగంట కథ ఆ అసంతృప్తిని దూరం చేస్తుందనే చెప్పాలి.

## మళ్లీ అలాంటి పాత్రలు ఎప్పుడు వస్తాయో..

### - ఎదురుచూస్తున్నానన్న జాతీయ అవార్డు నటి



‘మహానటి’ చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న కీర్తి సురేశ్, తాజాగా తన కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ చిత్రంలో తాను పోషించిన సావిత్రి పాత్ర తరహాలోనే, మళ్లీ అంతటి బలమైన మరియు గుర్తింపు తెచ్చే పాత్ర కోసం ఎదురుచూస్తున్నానని ఆమె వెల్లడించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి, తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. “మహానటి నా జీవితాన్నే మార్చేసింది. అంతటి గొప్ప నటి పాత్రను పోషించడానికి మొదట్లో భయపడినప్పటికీ, అది ఒక అరుదైన అవకాశం అని నాకు తెలుసు. ఆ చిత్రం నాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. అయితే, గత కొంతకాలంగా ఆ స్థాయి విజయం దక్కలేదు. ప్రస్తుతం మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ పాత్రల కోసమే ఎదురుచూస్తున్నాను” అని కీర్తి సురేశ్ వివరించారు. మహానటి విడుదలైన తర్వాత దాదాపు ఆరు నెలల పాటు తనకు ఒక్క సినిమా ఆఫర్ కూడా రాలేదని ఆమె గతంలోనే పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం కీర్తి సురేశ్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన తాజా తమిళ చిత్రం ‘రివాల్వర్ రీటా’ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. అలాగే, బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు సరసన ‘రఫ్తార్’ అనే చిత్రంలో నటిస్తున్నారు; ఇది జూలైలో విడుదల కావాల్సి ఉంది. తెలుగులో విజయ్ దేవరకొండతో ‘రౌడీ జనార్ధన’, ‘రెండు జెళ్ల సీత’ చిత్రాలతో పాటు, తమిళంలో ‘కన్నివేది’, మలయాళంలో ‘తోట్టం’ వంటి విభిన్న ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూనే, మరో ‘మహానటి’ వంటి ప్రాముఖ్యత ఉన్న పాత్ర కోసం ఆశిస్తున్నానని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## రొమాంటిక్ హారర్ చిత్రంలో సయీా..



‘మేజర్’, ‘స్కంద’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి సయీా మంజ్రేకర్, తాను నటిస్తున్న తాజా చిత్రం ‘ఇకాయ్’ తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్నదని తెలిపారు. రాఘవ్ జుయల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ రొమాంటిక్ హారర్ సినిమా కోసం తాను ఎంతో శ్రమించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సయీా మంజ్రేకర్ మాట్లాడుతూ, “ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ‘ఇకాయ్’ నాకు అతిపెద్ద సవాలు విసిరింది. షూటింగ్ సమయంలో కొన్నిసార్లు నా కంఫర్ట్ జోన్ దాటి నటించాల్సి వచ్చింది. ొన్ని సన్నివేశాల్లో సహజమైన భావోద్వేగాలను పండించడం కష్టంగా అనిపించినప్పటికీ, ఇలాంటి అనుభవాలే ఒక నటిగా నన్ను మెరుగుపరుస్తాయని నమ్ముతున్నాను,” అని వివరించారు. ఈ చిత్రంలో తన నటనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులు చూస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్ సింగ్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే ముంబైలోని కొలాబా ప్రాంతంలో జరిగింది. యాక్షన్, డ్రామా తరహా పాత్రలకు భిన్నంగా ఓ రొమాంటిక్ హారర్ కథలో నటించడం తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని సయీా భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ‘ఇకాయ్’ చిత్రాన్ని 2027 ప్రథమార్ధంలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## ఓటీటీలోకి ‘దృశ్యం 3’

### - జూన్ 18 నుంచి ప్రైమ్ వీడియోలో ‘దృశ్యం 3’



మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ‘దృశ్యం 3’ ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది. మే 21న విడుదలైన ఈ చిత్రం నెల రోజులు పూర్తికాకముందే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘దృశ్యం 3’ డిజిటల్ హక్కులను నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ నుంచి ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాల్లో ఒకేసారి స్ట్రీమ్ చేయనున్నారు. దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథను కొత్త కోణంలో ఆవిష్కరించారు. గత రెండు భాగాల మాదిరిగా వరుస ట్విస్టులపై కాకుండా జార్జ్‌కుట్టి పాత్ర ఎదుర్కొనే నైతిక సంఘర్షణలు, కుటుంబాన్ని కాపాడేందుకు అతడు ఎంతదూరమైనా వెళ్లే పరిస్థితులను ప్రధానంగా చూపించారు. బాక్సాఫీస్ వద్ద కూడా ‘దృశ్యం 3’ భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.234.97 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం విదేశాల్లోనే రూ.111.50 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. భారత్‌లో రూ.123 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అత్యధిక కలెక్షన్స్ సాధించిన మలయాళ చిత్రాల్లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. మోహన్‌లాల్‌తో పాటు మీనా, ఎస్తేర్ అనిల్, అన్సిబా హసన్, సిద్ధిఖ్, ఆశా శరత్, మురళీ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ‘ధురంధర్’ కంటే ‘గదర్’ సినిమాకే ఎక్కువ మంది ప్రేక్షకులు వచ్చారు: అమీషా పటేల్

బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ‘ధురంధర్’, ‘ధురంధర్: ది రివెంజ్’ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ చిత్రాల కంటే తన 2001 నాటి బ్లాక్‌బస్టర్ ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’, మరియు 2023 లో వచ్చిన ‘గదర్ 2’ చిత్రాలకే ఎక్కువ మంది ప్రేక్షకులు (ఫుట్‌ఫాల్స్) థియేటర్లకు వచ్చారని బాలీవుడ్ నటి అమీషా పటేల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. 2026 జూన్ 15 నాటికి అమీషా పటేల్, సన్నీ డియోల్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’ విడుదలై 25 ఏళ్లు పూర్తి కానుంది. ఈ సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే తాము 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకోబోతున్నాం. అయినప్పటికీ తమ చిత్రం ఇప్పటికీ ఒక ఐకానిక్ సినిమాగా నిలిచిందని అన్నారు.

‘గదర్ 2’ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల సునామీని సృష్టించిందని, కేవలం థియేటర్లలోకి వచ్చి సినిమా చూసిన ప్రేక్షకుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే, ‘గదర్ 1’, ‘గదర్ 2’ చిత్రాలు ‘ధురంధర్ చిత్రాల కంటే చాలా ఎక్కువ అని అమీషా పేర్కొన్నారు. ప్రేక్షకుల సంఖ్య పరంగా తమ సినిమాలు సాధించిన ఈ విజయం నన్ను ఎంతగానో సంతోషపరిచిందని, భారతీయ సినిమా చరిత్రలో తాను కూడా ఒక భాగమవడం, అంతటి గౌరవాన్ని అందుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. 1947 దేశ విభజన నేపథ్యంలో తెరకెక్కిన ‘గదర్: ఏక్ ప్రేమ్ కథ’ చిత్రం, ఒక సాధారణ సిక్కు ట్రక్ డ్రైవర్ తారా సింగ్ (సన్నీ డియోల్), విభజన సమయంలో ఒక ఉన్నత ముస్లిం కుటుంబానికి చెందిన సకీనా (అమీషా పటేల్) ప్రాణాలను కాపాడటం చుట్టూ తిరుగుతుంది. ఆ తర్వాత





వారిద్దరూ పెళ్లి చేసుకుంటారు, అయితే కొన్ని పరిస్థితుల వల్ల వారు విడిపోవాల్సి వస్తుంది. తన భార్యను తిరిగి తీసుకురావడం కోసం తారా సింగ్ పాకిస్తాన్‌కు ఎలా వెళ్లాడనేదే మొదటి భాగం కథ. ఇక ‘గదర్ 2’ విషయానికి వస్తే, ఈ చిత్రంలో తారా సింగ్ తన కుమారుడు జీతేను రక్షించడం కోసం మరోసారి పాకిస్తాన్ లోకి అడుగుపెడతాడు.

# వంటేరు ప్రతాప్ రెడ్డికి కేసీఆర్ ఆశీర్వాదాలు



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదినం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డికి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించినట్లు సమాచారం. ఈ భేటీలో ప్రతాప్ రెడ్డి తనయుడు, యువ నాయకుడు వంటేరు విజయవర్ధన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, గజ్వేల్ నియోజకవర్గ రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై స్వల్పంగా చర్చ జరిగినట్లు తెలిసింది. బీఆర్ఎస్ శ్రేణులు వంటేరు ప్రతాప్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

# అధికారం కోసం దిగజారుతున్న ప్రధాని మోడీ

**- డి సి సి జిల్లా అధ్యక్షులు అంక్షారెడ్డి**

**- రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీపై కాంగ్రెస్ ఆగ్రహం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే కాకుండా, అధికార దాహంతో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో ఇంతకాలం ఓటు చోరీకి పాల్పడిన బీజేపీ, ఇప్పుడు సీటు చోరీకి కూడా వెనకాడడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకు ఆ పార్టీ అగ్రనేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, గాంధేయవాది మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సభ్యత్వం దక్కకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. ఎలాంటి కేసులు లేకపోయినా బీజేపీ నేతల ఫిర్యాదుల ఆధారంగా నామినేషన్ పత్రాలను తిరస్కరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. అవినీతి, అక్రమాలతో దేశాన్ని అప్పులపాలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ అసలు స్వరూపాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, ఎరువుల సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ నాయకులు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, గుంటూకు శ్రీనివాస్, సుఖేందర్ రెడ్డి, కనకయ్య, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, డాక్టర్ వహీద్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారం శుభ్రం చేస్తామంటూ మహిళకు మోసం, కేసు నమోదు



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కల్లెపుమిందే అనుష (భర్త: విజయ్ కుమార్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం, జూన్ 13వ తేదీ ఉదయం సుమారు 9 గంటల సమయంలో అనుష తన ఇంటి వద్ద తన చెల్లెలు రిషికతో కలిసి ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంటికి వచ్చారు. బంగారం, వెండి వస్తువులను శుభ్రం చేసి మెరిపిస్తామని చెప్పి ఆమెను నమ్మించారు. వారి మాటలు నమ్మిన అనుష తన మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు పుస్తెలతాడును వారికి ఇచ్చింది. అనంతరం వారు తమ బ్యాగులో నుంచి ఒక గిన్నె తీసి అందులో ఓ ద్రవ పదార్థం పోసి, పుస్తెలతాడును అందులో ముంచి తిరిగి ఆమెకు ఇచ్చారు. ఆ తర్వాత అనుష పుస్తెలతాడును మెడలో ధరించింది. కొద్దిసేపటి తరువాత అనుమానం రావడంతో పుస్తెలతాడు బరువును పరిశీలించగా అది 21.69 గ్రాములు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో తన పుస్తెలతాడు నుంచి దాదాపు 8 గ్రాముల బంగారం తగ్గినట్లు బాధితురాలు తెలిపింది. తనను మాయమాటలతో నమ్మించి మోసం చేశారని పేర్కొంటూ అనుష పోలీసులకు ఫిర్యాదు చేయగా, తొగుట ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలు అపరిచితులను నమ్మి బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను అప్పగించవద్దని పోలీసులు సూచించారు.

# వర్గల్ క్షేత్రంలోవైభవంగా శని త్రయోదశి మహోత్సవం

**విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం**

**భక్తులతో కిటకిటలాడిన శంభూగిరి కొండలు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) వర్గల్ క్షేత్రంలో శని త్రయోదశి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శ్రీ శనీశ్వర భగవానుడికి ప్రత్యేక పూజలు, తిల తైలాభిషేకాలు, అర్చనలు నిర్వహించి మహోత్సవానికి అంకురార్పణ చేశారు. అనంతరం విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారికి తిల, తైలాభిషేకం నిర్వహించగా, కుంభ మీన, మేష, ధనుస్సు సింహ రాశుల వారు తైలాభిషేకంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. అలాగే శ్రీ విద్యాధరి, శ్రీ లక్ష్మి గణపతి, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర, శ్రీ సుబ్రహ్మణ్య, శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీ శశీబులింగేశ్వర క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడగా, అమ్మవారి నామస్మరణతో శంభూగిరులు మార్మోగాయి.

# మళ్ళీ గులాబీ జెండా ఎగరడం ఖాయం

**- కేసీఆర్ పాలనతోనే తెలంగాణ రూపురేఖలు మారాయి**

**- కాంగ్రెస్ 'ఫస్ట్ హాఫ్' పూర్తిగా విఫలమైంది**

**- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు అవసరం**

**- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ : కేటీఆర్**






వేములవాడ/సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శనివారం వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశాల్లో ప్రసంగించిన ఆయన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తవుతున్నా హామీల అమలులో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు అందాల్సిన ప్రయోజనాలు తగ్గిపోయాయని, వ్యవసాయ రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. రైతుబంధు పథకాన్ని బలహీనపరిచారని, రైతులకు మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేసిన కేటీఆర్, రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు, గురుకులాలు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ హయాంలో అమలయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణకు మళ్లీ కేసీఆర్ నాయకత్వమే అవసరమని, ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని అన్నారు. సిరిసిల్ల ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్న కేటీఆర్, రాజకీయంగా తన ఎదుగుదలకు సిరిసిల్ల ప్రజలే కారణమని చెప్పారు. జిల్లాగా సిరిసిల్ల అభివృద్ధి చెందడంలో కేసీఆర్ పాత్ర కీలకమని, భవిష్యత్తులో కూడా ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానని తెలిపారు. 'మన బలం -- మన బలగం' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డిజిటల్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలే ప్రధాన బలమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో గులాబీ జెండా మళ్లీ ఎగరడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం..

**గజ్వేల్‌లో ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా**

**అందుబాటులో : వంటేరు నరేందర్ రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ ) ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి, సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయ అవసరాలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతూ, ఎక్కడా కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక, గజ్వేల్, వంటిమామిడి, తూప్రాన్ మార్కెట్ కమిటీల చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి మించి ఎరువులను కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీలు, ఎరువుల విక్రయదారులతో సమన్వయం చేస్తూ రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. గజ్వేల్ రేక్ పాయింట్ ద్వారా గజ్వేల్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు యూరియా సరఫరా జరుగుతోందని, ఎరువుల కొరతకు తావులేదని స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విక్రయదారులు తమ దుకాణాల్లో తగినంత యూరియా నిల్వ ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సాధారణ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని రైతులను కోరిన ఆయన, నానో యూరియా వాడకం వల్ల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడే అవకాశముందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి గజ్వేల్ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మిస్తున్న దుకాణ సముదాయాల పనులను పరిశీలించారు. సమీకృత కూరగాయల మార్కెట్‌కు అదనపు ఆదాయ వనరులు కల్పించే లక్ష్యంతో మార్కెట్ ప్రాంగణం చుట్టూ రూ. 3 కోట్ల వ్యయంతో 28 దుకాణ సముదాయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ దుకాణాల ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం పెరగడంతో పాటు స్థానిక వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని వెల్లడించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందని వంటేరు నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పాలకవర్గ సభ్యులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సమన్వయంతో పనిచేయాలి

**- వాటర్ ప్లాంట్ గౌరవాధ్యక్షులు,గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**

**- నూతన కమిటీసభ్యులకు ప్లాంట్ నిర్వహణపై అవగాహన**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో ఉన్న బాలవికాస వాటర్ ప్లాంట్‌ను బాలవికాస సంస్థ టెక్నీషియన్ శనివారం సందర్శించి, నూతనంగా ఎన్నికైన ప్లాంట్ కమిటీ సభ్యుల సమక్షంలో ప్లాంట్ నిర్వహణ,నిర్వహణ విధానాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ గౌరవాధ్యక్షులు, గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడం కమిటీ సభ్యుల ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్లాంట్ నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని, యంత్రాల నిర్వహణ, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా కమిటీ సభ్యులు సమిష్టిగా పనిచేయాలని కోరారు.

# మేడ్చల్ దారిదోపిడీ కేసు

**పోలీసుల విచారణలో కీలక పురోగతి**

**సీసీటీవీ ఆధారాలతో ఒకరి అరెస్ట్..**

**మరొకరి కోసం గాలింపు**

**నిందితుడిపై గతంలోనూ కేసులున్నట్లు వెల్లడి**

**పోలీసు బృందానికి డీసీపీ ఎన్.కోటిరెడ్డి ఐపీఎస్ అభినందనలు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ కోర్టు సమీపంలో గత నెల జరిగిన ఒక మహిళపై దారిదోపిడీ యత్నం కేసులో పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో సాంకేతిక ఆధారాల




సాయంతో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు మేడ్చల్ పోలీసులు అధికారికంగా వెల్లడించారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటూరి శుభరాణి అనే మహిళ మే 29న రాత్రి విధులు ముగించుకుని మేడ్చల్ కోర్టు ఏరియాలోని పెట్రోల్ పంప్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఆమెను మాటల్లో పెట్టి, మెడలోని చైన్‌ను లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### 100కు పైగా సీసీ కెమెరాల పరిశీలన :

ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో క్రైమ్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ఘటనా స్థలంతో పాటు నిందితులు ప్రయాణించినట్లు భావిస్తున్న తూప్రాన్ మరియు పరిసర ప్రాంతాల మార్గాల్లో దాదాపు 100 నుండి 120 సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో లభించిన ఆధారాల ప్రకారం నిందితుల కదలికలను గుర్తించి జవహర్‌నగర్ పరిధిలో నివసిస్తున్న రూప్‌సింగ్ చతుర్‌సింగ్ తక్ (31) అనే వ్యక్తిని మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. ఇతడు మూలత మహారాష్ట్రలోని హింగోలి జిల్లాకు చెందినవాడని, ప్రస్తుతం ఇక్కడ స్క్రాప్ షాపులో పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతనిపై గతంలో కర్ణాటకలోని బీదర్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఒక కేసు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. నిందితుడి నుంచి ఒక ద్విచక్రవాహనం (ఛూ03జఔ3964), మొబైల్ ఫోన్ మరియు ఇమిటేషన్ చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ కేసులో ఎ1గా పేర్కొంటున్న శంషర్ సింగ్ అనే మరో వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

### పోలీసు బృందానికి డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్ అభినందనలు :

సమర్థవంతంగా విచారణ జరిపి నిందితుడిని పట్టుకున్న మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్, సీసీఎస్ డీసీపీ ముత్యం రెడ్డి, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, మేడ్చల్ ఎస్‌హెచ్ఓ ఎ. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కిరణ్ మరియు సీసీఎస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# మేడ్చల్‌లో 'పిచ్చి' కుక్కల గురక..

# గుప్పిట్లో ప్రాణాలు

- రెండేళ్ల బాలుడితో సహా రెండు రోజుల్లో 13 మందిపై దాడి
- రాఘవేంద్ర నగర్ కాలనీలో రక్తసిక్తమైన వీధులు
- పురపాలక కమిషనర్‌కు బాధితుల కాలనీవాసుల ఘోష
- రెండు రోజుల్లో 13 మంది క్షతగాత్రులు.. బాలుడికి తీవ్ర గాయాలు
- కాలనీల్లో నరకం.. పిల్లలు, వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరం
- రహదారులపై మృత్యుపాశాలుపురకపాలక కార్యాలయం ముట్టడి
- కమిషనర్‌కు వినతిపత్రం - తక్షణ చర్యలకు డిమాండ్








మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పరిసర ప్రాంతాలు ప్రస్తుతం భయానక వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వీధి కుక్కల స్వైరవిహారంతో స్థానిక ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు సాధారణంగా ఉన్న కుక్కలు, ఒక్కసారిగా పిచ్చిపట్టినట్లు జనంపై విరుచుకుపడుతున్నాయి. గడిచిన 48 గంటల్లోనే ఏకంగా 13 మంది అమాయకులు ఈ మూగజీవాల దాడిలో తీవ్రంగా గాయపడి రక్తసిక్తమవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## రెండు రోజుల్లో 13 మంది క్షతగాత్రులు..

## బాలుడికి తీవ్ర గాయాలు..

కాలనీలో పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. నిన్న ఒక్కరోజే వీధుల వెంబడి వెళ్తున్న ఎనిమిది మందిని కుక్కలు వెంటాడి మరీ కరిచాయి. ఆ భయం నీడ నుంచి కోలుకోకముందే శుక్రవారం మరో ఐదుగురు కుక్కల దాడికి బలయ్యారు. బాధితుల్లో అత్యధికులు రక్షణ లేని చిన్న పిల్లలే ఉండటం గమనార్హం. ముఖ్యంగా స్థానిక నివాసి వీరి ప్రదీప్ కుమార్ అనే కేవలం రెండు సంవత్సరాల పసికందుపై కుక్కలు గుంపుగా దాడి చేశాయి. బాలుడి ముఖం, కంటిపై భాగం మరియు తలపై కుక్కలు పీకేయడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆ బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇందుకు సంబంధించిన హృదయవిదారకర చిత్రాలు స్థానికులను కన్నీరు పెట్టిస్తున్నాయి.

## కాలనీల్లో నరకం.... పిల్లలు, వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరం..

సాయంత్రం వేళల్లో ఇళ్ల ముందు ఆడుకునేందుకు కూడా పిల్లలు భయపడుతున్నారు. కాలనీ వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, పిల్లలు కనిపించగానే ఒక్కసారిగా వేటాడుతున్నట్లు విరుచుకుపడుతున్నాయి. రాత్రి సమయాల్లో లేదా తెల్లవారుజామున వృద్ధులు అత్యవసర పనులపై బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. కుక్కలు ఒక్కసారిగా మొరుగుతూ వెంటబడటం వల్ల వృద్ధులు కిందపడిపోవడం, తీవ్రమైన మానసిక ఆందోళనకు గురికావడం జరుగుతోంది.

## రహదారులపై మృత్యుపాశాలు..

కేవలం పాదచారులకే కాదు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి కూడా ఈ కుక్కలు పెద్ద శాపంగా మారాయి. వాహనాల శబ్దం వినబడగానే కుక్కలు అకస్మాత్తుగా రోడ్డుపైకి దూకుతున్నాయి. దీంతో బైక్‌లు అదుపు తప్పి కిందపడిపోవడంతో పలువురు వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారు. మరోవైపు, కాలనీల్లోని చెత్త కుప్పల వద్ద వందలాది కుక్కలు చేరుతున్నాయి. ఆహారం కోసం అవి ఒకదానితో ఒకటి పోరాడుకుంటూ అర్ధరాత్రి వేళల్లో భీకరంగా అరుస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి.

## పురకపాలక కార్యాలయం ముట్టడి

## : కమిషనర్‌కు వినతిపత్రం

ఈ దారుణ పరిస్థితులపై స్థానిక కాలనీ నేత వీరి హరి గౌడ్ ఆధ్వర్యంలో ఆగ్రహించిన కాలనీవాసులు మేడ్చల్ పురపాలక కార్యాలయానికి తరలివెళ్లారు. పురపాలక కమిషనర్ ను కలిసి, తాము ఎదుర్కొంటున్న నరకయాతనను వివరించారు. గాయపడిన పిల్లల ఫోటోలను, వివరాలను కమిషనర్‌కు చూపిస్తూ రాతపూర్వక ఫిర్యాద సమర్పించారు.

## బాధితుల డిమాండ్..

మా పిల్లల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను పట్టుకెళ్లాలి. జనాభా నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ-రేబిస్ వ్యాక్సినేషన్లు వేగవంతం చేయాలి. ఇంకా ఎంతమంది రక్తం చిందించాక అధికారులు మేల్కొంటారు?" అని కాలనీవాసులు నిలదీస్తున్నారు. ఈ వినతిపత్రంపై అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే, కాలనీవాసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హరి గౌడ్ హెచ్చరించారు.

# "8" ఎకరాల పై అందరికి అనుమానమే:కృష్ణ రావ్

- సరిహద్దులు మార్చేశారు,సర్వే నెంబర్లను సమాధి చేసిన మేధావులు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావ్
- సిఎం,రెవిన్యూ అధికారులకు లేఖలు అందజేశాం.

న్యాయం జరగకపోతే "న్యాయ స్థానాన్ని" ఆశ్రయిస్తాం:ఎమ్మెల్యే









కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి డివిజన్ బాల్ నగర్ మండలానికి చెందిన సర్వే నెంబర్ 57 పైగా ల్యాండ్ స్నీ గతంలో రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చిన విషయం అందరికి తెలిసిందే.అదిగాక గతంలో 1999 ,2001 సంవత్సరంలో పేద ప్రజలకు సర్వే నెంబర్ 57 లో పట్టాలు (పొజిషన్ సర్టిఫికేట్) పంపిణీ చేసే క్రమంలో అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టు వివాదాల్లో ఎనిమిది ఎకరాల స్థలం ఉన్నందునా పట్టాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావ్ పేర్కొన్నారు.ఈ విషయం పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కిజిల్లా రెవిన్యూ యంత్రాంగానికి లేఖలు రాసినట్లు చెప్పారు.ఎవ్వరితోన్యాయం జరగకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.మరో విషయం ఏమిటంటే గతంలో మేడ్చల్ జిల్లా ఏడీ రాంచందర్ సర్వే నివేదిక తన వద్ద ఉన్నదని, భవిష్యత్తులో అన్ని బయటపెడతానని మాధవరం తెలిపారు.

## ఎమ్మెల్యే కే నియోజకవర్గం హద్దులు, అధికారుల వివరాలు లేవు:

కూకుట్పల్లి నియోజకవర్గాన్ని ముక్కలు,ముక్కలుగా చేసిన సర్కార్.ప్రస్తుతం కూకుట్పల్లి నియోజకవర్గం హద్దులు, మున్సిపల్ అధికారుల వివరాలు లేకపోవడం, కనీసం అధికారులు ఎమ్మెల్యేకి కలిసి వారి పరిచయం చేసుకోకపోవడం నిజంగా శోచనీయమని, త్వరలో ఉన్నతాధికారులను కలిసి వాస్తవాలపై పోరుబాట పెట్టాల్సిందేనని ఆయన అన్నారు.మరో విషయం ఏమిటంటే ఫత్తేనగర్, బాలానగర్,బోయిన్ పల్లి, హస్మత్ పేట డివిజన్ లల్లో ప్రాంతంలో ఉన్న సమస్యల విషయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ప్రధానంగా బోయిన్ పల్లి డివిజన్ లోని కాలనీ అసోసియేషన్ వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కరించే విధంగా అక్కడికక్కడే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. ఇక్కడ ఉన్న ప్రాంతాలను. మల్కాజిగిరి జోన్లో కలపడం వల్ల అధికారులకు సమన్వయ లోపం జరిగి పనుల్లో ఇబ్బంది జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు వారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వివరించారు.కోయబస్తీలో వాటర్ బోరు పనిచేయక ఇబ్బంది పడుతున్నామని. అలాగే విఠల్ ఎంక్లేవ్ లో డ్రైనేజ్ సమస్య, హస్మత్ పేట స్మశాన వాటిక అభివృద్ధి, అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు, వాటర్ పైప్లైన్లు ఇబ్బంది,నీటి ప్రెజర్ రాక ఇబ్బందులు ఇలా అనేక సమస్యలను అసోసియేషన్ సభ్యులు అధికారులకు వివరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే వారు అందించిన సమస్యలను తీర్చాలని లేని ఎడల మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేయడానికి అయినా వెనుకాడను అని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ గౌడ్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బల్వంత్ రెడ్డి,కర్రె జంగయ్య,లావణ్య,మాజీ కౌన్సిలర్ మక్కల నర్సింగ్ రావు, కూకుట్పల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ గజ్జెల నాగేష్,డివిజన్ జనరల్ సెక్రటరీ మేకల హరినాథ్, అజీజ్ బాయ్,మట్టి శ్రీను,బుర్రి యాదగిరి, రాజు,చందు, బాల్ రాజ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## కాలపాణిలో ఎమ్మెల్యే పాల్ ఎంత ? బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ సర్వే నెంబర్ 157/1 పై ఫైర్:

బోయిన్ పల్లి మార్కెట్ యార్డు సమీపంలో కోట్ల రూపాయల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ స్థలం ప్రైవేట్ స్థలంగా ఎలా మారిందో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె కృషాంక్ డిమాండ్ చేశారు. బోయిన్ పల్లి ఎన్ఐఎంహెచ్ ఎదురుగా ఉన్న ఎనిమిది ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు.గత ఏడాది క్రితం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ప్రతిపాదనతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.400 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం పై ఎమ్మెల్యే నోరు మెదపకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఈ అంశంపై మాట్లాడకపోవడం పై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు ఆయన చెప్పారు.ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని గత ఏడాది హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రభుత్వ భూమి ప్రైవేటుగా మారడం వెనుక ఆయనకు లాభపడ్డారేమో అని అన్నారు.కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తన చిత్తశుద్ధిని చాటుకోవాలంటే ఈ ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పి ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ స్థలాలుగా మార్చే ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాత్ర పై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

## బిఆర్ఎస్ సీనియర్ నేత గజ్జెల నాగేష్ వివరణ:

టిఆర్ఎస్ నాయకుడు గజ్జల నాగేష్ సైతం ఈ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల దారాదత్తం చేయడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములు ప్రభుత్వ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపిస్తున్న ప్రేమ ఈ స్థలంపై కూడా చూపిస్తే పేదలకు మేలు జరుగుతుందని చెప్పుకొచ్చారు.స్థానికంగా పేదలు మధ్యతరగతి కుటుంబాలు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఉన్నారు.అలాంటి వారి కోసం రెండు పడకల గదుల నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూం లను , ఇందిరమ్మ ఇళ్లు గా మార్చి పేదలకు అందజేస్తున్న రేవంత్ సర్కార్.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి తిరుమల గిరి మండలంలో సర్వే నెంబర్ 157/1 లో ఉన్న ఎనిమిది ఎకరాల భూమిలో పేదల కోసం ఇళ్ల నిర్మాణం చేయాలని, లేని పక్షంలో ఉద్యమం చేసైనా సాధించుకుంటామన్నారు గజ్జెల నాగేష్.

## తుని బాలిక అదృశ్యం ఘటనపై

# పవన్ కల్యాణ్ ఆరా

-ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి



అమరావతి (ప్రశ్న న్యూస్)కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు.ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు.ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.

# అంగన్వాడీల సంక్షేమమే తమ ప్రాధాన్యత

- వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.

# పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు

- కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పోలీసు శాఖ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ (2025-26)'కు ఎంపిక చేసింది. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా పూర్తి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 19న ఢిల్లీలో నిర్వహించనున్న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేడుకల్లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'వెరిఫాస్ట్' మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రక్రియ అంతటా పారదర్శకతను పెంచారు. జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ వినూత్న విధానం, పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ పోలీసుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588